


# అప్రయోజకుడు

నరసింహామూర్తి

అతను చేతకాని వాడని ఆమె నమ్మకం.

'ప్రొద్దున లేచింది మొదలు కొని ఒకటే చాకిరీ. ఆడపనీ, మగపనీ చూసుకోవాల్సివచ్చె' అంటూ చొక్కా తొడుగుతున్నది పిల్లవాడికి.

వాడూరికే ఏడుస్తున్నాడు క్రొత్త చొక్కా కావాలని.

'పాడుపక్షీ, పళ్లొస్తున్నకొద్దీ పసిబొంద వవుతున్నావు' అన్నది బుగ్గనలుపుతూ. మహా జోరుగా ఏడుపు ప్రారంభించాడు కుర్రవాడు.

'ఏమిటదీ, మరీ ఒళ్లూపై తెలియకుండా' అంటూ పిల్లవాడిని దగ్గరికి తీసుకున్నాడు రామం.

'చాల్లెస్తురూ, చెప్పొచ్చారు. బయటికి పోతే ఎందుకూ కొరగాక పోయినా, యింట్లో నామీద మాత్రం ఒంటికాలిమీద లేవటం చేతవు' అన్నది విసుగ్గా, వంటింట్లోకి వెడుతూ. మధ్యలో ఆగి,

'అంతగారాబమైతే, అబ్బాయికి కావలసినవన్నీ అమర్చకూడదూ. బజార్లో గుడ్డమ్ముస్తున్నారట వెళ్ళి తెచ్చుకోకూడదూ?'

'అయితేదానికి వాణ్ణి కొట్టటమెందుకూ?

'పీడించుకు తింటూంటే ఏమిటీచేయటం. ఆడ మగ; అంతా ఏకమై—అబ్బ, ప్రాణం విసిగి పోతున్నది. ఇప్పుడన్నం కావాలంటాడు. ఎవరింటికన్నా అప్పుకుపోవాలి. రేషన్‌కొట్లో యివ్వక పోతే, కాస్త నాలుగుడబ్బులు హెచ్చైనా పెట్టి యింకొకచోట కొనుక్కురావటం చేతకాక పాయె, ఏమిటీ చచ్చేది.'

'అయితే, అన్నింటికీ నా చేతకాని తనమేనా కారణం?' చాల మెల్లగా అన్నాడీమాటను. ఎందు వల్ల తనకీ పేరొచ్చిందో అతనికి అవగాహన కాలేదు.

పిల్లవాడిని దించి బయటకు బయలుదేరాడు. మామూలు ప్రకారం వర్కుషాపుకి పోయినాడు అప్పటికింకా టైముకాలేదు కూలీలంతా బయటనే కూర్చుని వున్నారు. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు.

రోడ్డు మధ్యగా నడుస్తున్నాడు రామం. ఉన్నట్లుండి తన వెనకాల వాళ్లంతా నవ్వటం ప్రారంభించారు. ఆలోచనలోవున్న వాడల్లా చప్పున వెనక్కు తిరిగాడు. కొంచం నవ్వు తగ్గింది. ఎంత తెలివి తక్కువ ఆఫీసరైనా, వెనకాల విమర్శిస్తారుగాని, బయటపడి వేళాకోళం చేయటానికి సాహసించరు. మామూలుగా నడుస్తున్నాడు.

'పాపం, యీయన్ను చూస్తే జాలేస్తుందిరా. ఎన్నివందలొస్తే ఏం, రోజూ తిట్లేగదా ఛీఫ్ సూపరింటెండెంటు చేతులో' అని వినిపించింది.

తనస్థితి యింటా, బయటా ఒకటిగానేవుంది. వీళ్లుకూడ తన్నుచూసి జాలిపడేవాళ్లే.

'మొన్న ఏదో పనిచెయ్యమని యింజనీరు చెప్పితే, అది కాస్తా, తప్పుచేసి కూర్చున్నాడు. ఆయన మాత్రం ఏంచేస్తాడు తిట్టక.'

చేతకానితనంవల్లనే చేశాడా తనాపని—అయినా ఈ ప్రపంచంలో తనకు చేతనయిన పనే లేదూ ?

గేటుదాటాడు. అక్కడ ఎవరున్నదీ, ఏమీ గమనించలేదు. వెనకాలనుంచి,

'మిస్టర్, రామం' వెనక్కు తిరగ్గానే ఛీఫ్ కనిపించాడు.

'గుడ్ మార్నింగ్ సర్' అన్నాడు.

'సరే' తిరిగి విష్ చేయాలని తోచకనో, అవసరం లేదనో, ప్రతి నమస్కారం చేయలేదు.

'రెండో యింజన్లో ఏదోచెడ్డదిట. దాని విషయం చూడు, క్విక్‌గా కావాలి' అంటూ వెంటవచ్చాడు.

'మీ రెందుకూ, నేను చేస్తాను.'

'ఎలా చేస్తావో చూద్దామని.' తనమీద యింత అపనమ్మకం ఎందుకూ? తను చేతకానివాడనేనా-

డ్రెస్ మార్చటానికికూడ టైమివ్వలా. సరాసరి యింజను రూములోకిపోయి కావలసిన పరికరాలు తీసుకుని పని కుపక్రమించాడు. స్పానర్ తీసుకుని బోల్టు తీస్తుంటే–

'అదేమిటోయ్, బోల్టు తీయటంకూడ చేతకాదు' అన్నాడు విసుక్కుంటూ. చేసేది రైటే, యింకెలాగ చేయటం—ఏదో అనాలని అంటంలాగావుంది కాని వేరే ఏంలేదు. అయినా పెద్దవాళ్లేమన్నా పడాల్సిందే - ఎలాగైతేనేం భయపడుతూ భయపడుతూ పైకవర్ వూడదీశాడు.

'ఏమిటో డిఫెక్టు చూడు.'

అంతాతీసిచూస్తే, ఏమీకనపడలేదు. చక్కగా తుడిచి తిరిగి పెట్టబోతూంటే-

'ఏమిటీ డిఫెక్టు' అని అడిగాడు.

'ఏమీలేదు. కొంచం లూబ్రికెంటు స్టిక్ అయింది. దాన్ని తుడిచాను.'

'అంత మాత్రానికే యింజను ఆగిపోతుందా. నాకు తెలుసు నీకు చేతకాదనీ. అందుకనే వెంట వచ్చా' అని తన చేతిలోకి తీసుకుని, ఏదో చూసినట్లుగా చూసి అలాగే పెట్టేశాడు.

ఆయన తనకంటే చేసిందేముంది? ఇప్పుడు యింజను బాగాపనిచేయటంలా. మరి తననంతా చేతకానివాడని ఎందుకంటారు? తన పదవి చూసుకున్న అహంకారమేమో తన చీఫ్‌కి, ఒక్కసారి వెళ్ళి అడిగి వద్దామనుకున్నాడు. వుట్టి పుణ్యానికి తిట్టిపోయినాడు. ఇంతకీ తన మెతకే తన్నింతవరకూ తెచ్చింది. తను వూరుకోవటంవల్లనే అలుసయినాడు. ఇంట్లో వాళ్లు మాత్రం-బజారుకుపోతే గుడ్డలేదని వాళ్ళంటారు. అంతా తిరిగి వచ్చినట్లే తనూ తిరిగివచ్చాడు. మరి వాళ్ళంతా చేతకానివాళ్లే. వాళ్ళని ఎవరూ అలా అనరే! నిన్న బియ్యం లేవంటే ఎంతమంది వుట్టి చేతుల్తో వెళ్లలేదు.

వీళ్ళంతా కలిసి తనమీద కుట్ర పన్నుతున్నారేమో అనిపించింది.

ఆరోజు సాయంత్రం కాజుయల్ లీవు తీసుకున్నాడు. ఏమీ తోచటంలా, ఇంటో భార్యతో మాట్లాడ బుద్ధి పుట్టలా. కుర్రవాడు నిద్రపోతున్నాడు. ఊరికే పచార్లు చేస్తున్నాడు. ఇంతట్లో ఎదురింటివాళ్ళమ్మాయి వచ్చి,

'మామా, యివ్వాళ ఫ్యాక్టరీ లేదా?' అని అడిగింది.

'లేదమ్మా' అని మాత్రం అన్నాడు. రోజూ ఆ అమ్మాయి వచ్చినప్పుడల్లా ఒళ్ళో కూర్చోపెట్టుకుని కబుర్లుచెప్పటం అలవాటు.

'ఏం, మామా అలా వున్నావ్?' నాలుగేళ్ళ పిల్ల వేసిన ప్రశ్న వేసింది. ఆమెకూడ ఏమంటుందో అని వెంటనే,

'ఏంలేదమ్మా ఊరికనే ఏమీ తోచటంలేదు' అన్నాడు ఎటో చూస్తూ.

'అయితే వుండు. మానాన్న నాకొక బూర తెచ్చాడు. నాకు వూదటం చేతకాలేదు నీ వూది పెడతా?'

'ఆ' అనగానే పరుగెత్తుకుపోయి బూర తెచ్చి యిచ్చింది. పరధ్యానంగా వూదేడేమో, అది కాస్తా పగిలిపోయింది. ఇప్పుడా అమ్మాయి ఏడుస్తుందేమో, ఏమిటీచేయటం? దగ్గరకుతీసి 'నేనింకోటి యిస్తాలే అమ్మా. ఏడవబోకు' అని గడ్డం పట్టుకు చెప్పాడు.

'పోనీలే, మళ్ళీ మా నాన్నచేత తెప్పించుకుంటాలే.' అమాయక హృదయంతో అభయహస్త మిచ్చింది చిలిపిచూపులు చూస్తూ.

రామానికి గుండెల్లో రాయి పడ్డది.

వాళ్ళ నాన్నతో చెప్తుం దన్నమాట. ఆయన ఏమనుకుంటాడూ? ఆయనకూడా తను చేతకానివాడనే అభిప్రాయం పడదూ. ఆయనమాత్రం నవ్వడూ. అదే ఆలోచన.

'మామా, నీవు నన్ను గిరగిర తిప్పుతా?' అన్నదాపిల్ల.

'పడితే'

'ఎందుకు పడతానూ? మా నాన్న రోజూ తిప్పటంలా. అయితే నీకు చేతకాదన్న మాట'

ఈ చిన్నమ్మాయికూడ అనేసింది.

ఇంతలో అబ్బాయి వచ్చి, 'కాఫీకి రమ్మంటున్నదమ్మ' అని పిలిచాడు. లోపలికిపోయి కాఫీ త్రాగుతూ త్రాగుతూవుంటే ఎందువల్లనో కప్పు జారిపడ్డది, కప్పు పగిలింది. ఇల్లంతా కాఫీ మయమయింది.

'అయ్యో, కర్మ; కాఫీ త్రాగటంకూడ చేత కాదేం ఈ మనిషికి' అన్నది యిల్లాలు.

తనకేమీ చేతకాదు; తేలిపోయింది. ఇక ఈ ప్రపంచంలో తనెందుకూ పనికిరాడు—

అసాయంత్రం—

పడిపోతున్నాడు, ఏ ప్రక్కకో— ఏ వుద్దేశ్యంతోనో. పొలాల్లో నారుపోశారు. పచ్చని పట్టు వస్త్రం కదలినట్లు, గాలికి తలలాడిస్తూ శోభను వెళ్ళబోస్తున్న ఆచిట్టి మొలక లతనికండ్ల నాకర్షించలా. పైరగాలి దేహాన్ని పులకరింపచేయలా. వినీలాకాశం ఆనందం కలిగించలా. మనస్సుతో పాటు అన్ని అవయవాలూ తమ కార్యక్రమాల్ని ఆపుచేసినయి. తనచుట్టూ యింత ప్రపంచం, అందమయిన ప్రకృతీ వుంటే ఆనందించని మనిషి మహాశ్లేనా? కాదేమో? తన పరిసరాలతో పడలేక, భారమయిన హృదయంతో, వీగిపోయిన మనస్సుతో క్రుంగేవాడు నికృష్టుడవుతాడు. అతని స్థూలమనస్సే అతన్ని శాసిస్తుంది. ఆ విషయం కూడా గమనించలేని స్తబ్ధుడౌతాడావ్యక్తి.

రాత్రి అయినదనే చెప్పొచ్చు. ఒక వూరి పొలిమేరకొచ్చాడు. స్త్రీలంతా నీటిబిందెలెత్తుకుని గృహాలకువెళ్ళి చాల సేపయింది. అంతా సర్దుమణిగివుంది.

తనెక్కడ వున్నదీ ఆనవాలు పట్టలేకపోయినాడు రామం. ఎంతదూరం నడిచివచ్చాడో తెలియదు. మామూలురోజుల్లో అయితే ఈ ప్రయాణానికి ఎంతఆహారం అవసరమయ్యేదో! మంచినీళ్ళవుతున్నయి. దగ్గరలో బావి వుందేమోనని చూచాడు. ప్రక్కనే వుంది ఒకటి: ఎవరో తోడుకుంటున్నారు కూడాను.

బావిదగ్గరకుమెల్లగాదేహాన్నీడ్చుకుంటూ వెళ్లాడు.


'ఎవరు' అని కేకేసింది ఆమె. దొంగ అనుకున్నదో ఏమో!

'కాసిని మంచినీళ్లు కావాలి' అన్నాడు కొంచం చిన్నగొంతుతో.

'ఎవరు బ్రాహ్మలా?' అని ప్రశ్న వేసింది.

ఏమిచెప్పటానికి తోచలా. ఎలా చెపితే యిస్తుందో. ఏమీ మాట్లాడలా!

'అయితే యిలారా నాయనా, కడవతో నీళ్లు తోడుకో' అని చాంతాడు, కడవ యిచ్చింది.



పైకి లాగుతుండగా అది మరి ఏ వరకు తగిలిందో, కుండ కాస్తా టప్ మన్నది. 'అయ్యో', ఎక్కడికొచ్చినా పొద్దెదురుగా వున్నదే.

దీనంగా చూచాడామెవైపునకు.

'ఏంనాయనా, పగిలిందా ? మళ్ళీ యింటికి పోవాల్నే– ఏదోలే ఓటికుండ. ఇంకోటి తెస్తా వుండు' అని వెళ్ళింది.

విస్తుపోయినాడు రామం. అరే! ఎంతటి తుపాను రేగుతుందో ననుకున్నాడు. ఏం తిట్లు తిడుతుందో అనుకుంటే, శాంతంగా వూరుకున్నది. జన్మలోకల్లా మొదటిసారి యిటువంటి వాళ్లను చూడటం. తనమీద యింత దయచూపిస్తున్న ఆ వ్యక్తికి హృదయంలో శత సహస్ర వందనాలర్పించాడు. ఈవిడే దగ్గర నన్నుండనిస్తే బాగుండును – అనిపించింది. అయినా ఆమెకు కొడుకులూ, భర్తా-కుటుంబమంతావుంటారు. తన్నెందుకుండ నిస్తారూ ?

ఇంతలో ఆమె తిరిగి వచ్చింది.

'పనికొస్తే నే తోడిస్తా, నాయనా.'

'ఎందుకమ్మా, నేతోడుకుంటాను' అని కడవ లాక్కుని, తాడు మెడకి తగిలించి బావిలోకి వేశాడు. ఏవరకు తగలకుండా పైకి లాగేసాడు. తన పని తనానికి, నేర్పుకీ తనే మెచ్చుకున్నాడు. ఆవిడకు మరో కడవ తోడి యిచ్చాడు.

ఎందుకనో ఆవిడతో మాట్లాడాలనిపించింది.

'ఇదే వూరండీ'

'మల్లాపురం. మనదేవూరు ?'

అసలు వూరుపేరు చెప్పటాని కిష్టపడలా. అక్కడవుండే మనుష్యులమీదవుండే ఏహ్యభావం వలన ఆవూరంటేనే సరిపడలా. అబద్ధం చెప్పటమెందుకని మాట్లాడలా.

'ఏ వూరు వెళుతున్నావ్'

ఏమో, తనెక్కడికని బయలుదేరాడు ?

'ఏదో వూరు'

'అదేమిటి బాబూ, ఒక వూరనిలేదూ ?'

సంభాషణ మార్చాలని,

'ఈ వూరిలో సత్రాలున్నాయా ?' అని అడిగాడు.

'లేవు. యిదెంత, కుగ్రామం. నా యింటి కొస్తావా ? అయినా బ్రాహ్మణబ్బాయి వల్లే వున్నావు'

'లేదు' అనేశాడు చప్పున.

'మరిందాక నీవే తోడుకున్నావే.'

'ఏదో మీకు శ్రమెందుకని-' సమయోచితంగా జవాబివ్వ గలిగినందుకు సంతోషించాడులోలోపల.

'అయితే మా యింటికిరా' అని పిలుచుకు వెళ్ళింది.

'ఎందుకు లెండి' అనికూడా అనాలనిపించలా. మంచి హృదయంతో మాట్లాడితే మెచ్చుచల్లినట్లే. మాట్లాడకుండా ఆమె వెంటవెళ్లాడు.

చక్కగావుంది గుడిసె, ఆ వూరి పొలిమేరలో వుందా యిల్లు. చుట్టు ప్రక్కల యిళ్లేంలేవు. ఇంట్లో మరెవ్వరూ కనుపించలేదు.

ఆ ముసలమ్మకు ఎవ్వరూలేరు. 'నా' అనుకో దగ్గవారు సమసిపోయి చాలరోజులయింది. అప్పటినుంచి అలాగే వెళ్లదీస్తున్నది కాలం. వున్న ఎకరం కుంట్రా పాలికిచ్చేసింది. ఇంట్లో పాడి. వచ్చేగింజలు పెట్టుకుని, నిశ్చింతగా గడుపుతున్నది. ఒక్క కడుపుకు ఏమంత కావాలి. ప్రొద్దున, సాయంత్రం, రెండుపూటలకు కలిపి ఒక్కసారే యింత వుడ కేసుకునేది. ముసలితనంతో పాటు, వేదాంతంకూడా వచ్చిందేమో. ఏ మిరపకాయ పచ్చడో, ఊరగాయో వేసుకుని కడుపు నిండించుకునేది. లేక కాదుసుమండీ! ఎవళ్లకు వాళ్లు చేసుకు తినాలంటే ఎప్పుడూ అంతే. అందులో నలుగుర్లో వుండి ఒక్కసారిగా వంటరిగా వుండాల్సొస్తే మరీను.

ఆరోజునుంచీ రామం ఆవిడకు చేదోడువాదోడుగా వుంటూండేవాడు. ప్రొద్దుట గేదెపాలు తియ్యటందగ్గరనుంచి, కళ్లాపు చల్లటం మినహా-ఆడవాళ్ళకు అనుమానం, మగవాళ్లు చీపురు పుచ్చుకుంటే అనర్థం రాగలదని-అన్నిపనులూ చేసేవాడు. బయటకు వెళ్ళి అంగట్లో వస్తువులు తేవాలంటే మాత్రం అవ్వే వెళ్ళి తెచ్చేది.

మధ్యాహ్నం మాత్రం ఏమీ తోచేదికాదు. తన పూర్వచరిత్ర గుర్తుకొచ్చినప్పుడల్లా మనస్సులో కెలికినట్లుగా వుండేది. తిరిగి వెళ్లిపోదామనిపించేది. పాపం, కొంచెం నోటిదురుసే ననుకో మనిషికి. అంతమాత్రంచేత ఆమెను వదలిరావాలా! ఈ ఆలోచన వొచ్చినప్పుడల్లా అవ్వతో సంభాషణ వేసుకునేవాడు. ఆ వాతావరణలో నిజంగా ప్రశాంతత వున్నది.

రామం బావమరది వచ్చి వూరంతా గాలించాడు. ఎక్కడని పట్టుకుంటాడు. మహానగర మాయెను! విసుగెత్తింది. చివరకి ఫోటో పేపర్లో వేయించాడు. అయినా రామంవున్న వూళ్ళో అంతా చదువురానివాళ్ళే. కాయకష్టం చేసుకు బ్రతికేవాళ్లు. ఇక పత్తా తెలియట మెలా. రామం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది.

* * *

రెండువారాలు గడిచినయి.

ఎంతకాలమని యింట్లో కూర్చుంటారు ఎవరు మాత్రం. కాస్త గాలిమేసి వద్దామన్నట్లు అలా బయటికి వెళ్ళాడు రామం. ఆ యిల్లు వూరి బయట వుండటంవల్ల, ఎప్పుడూ యింట్లో కూర్చునే రామానికి గ్రామాన్నిగురించి తెలియటానికి ఏంత మాత్రం అవకాశంలేదు. ఏరోడ్డు ఏవైపు కెడుతుందో అసలే తెలియదు.

ప్రకృతి విలక్షణంగా వుంది. అరుణార్కుని పండు కిరణాలు ప్రశాంతిని విరజిమ్ముతున్నట్లుగా వుంది. అప్పుడే తిరిగి వస్తున్నారు పొలాలనుంచి రైతుజనమంతా. తలకు మొలకు తప్ప ఆచ్ఛాదనే లేదు. నాగళ్లు నడుపుకుంటూ ఆనందంగా వచ్చేస్తున్నారు. పట్టణాల్లో విరివిగా వేషముంటేగాని కాలు బయట పెట్టమే, ఇక్కడ పల్లెవాసులంతా దాదాపు నగ్నంగా వున్నారే! ఇది లేమివల్లనా లేక పని చేసేటప్పుడు వేసుకునే వేషమా. ఏమీ తేల్చుకో లేకపోయినాడు.

ఇంకా నాలుగడుగులు ముందు కేశాడు. గ్రామంలో ఒకవీధి కనుపించింది. ఎంత మురికిగా వుంది! పిల్లలంతా చొక్కాలు లేకుండా వీధిలో తిరుగుతూ ఆడుకుంటున్నారు. ఇంకా కొంచంపైన రైతులంతా చేరి ఏదో మాట్లాడుకుంటున్నారు.

రామాన్ని చూడగానే వాళ్ళంతా మాటలు మానేశారు. చాలా మెల్లిగా 'యిదిగో, ఈనే రంగమ్మగారబ్బాయి' అనుకోటం విన్నాడు రామం. ఇదెలా ప్రాకిపోయింది చెప్మా! అనుకున్నాడు. కాని యింత చిన్నగ్రామంలో ఒకళ్ళవిషయాలు యింకొకళ్ళకి తెలియకుండా వుంటాయనుకోవటం పొరపాటు. వాళ్ల వంక తలెత్తిచూడలేదు. ఓరగా చూస్తూ వాళ్లని దాటి వెళ్లిపోయినాడు. మొదటి నుంచి అతన్ని చెడగొట్టింది, ప్రస్తుత పరిస్థితికి కారణమూ ఆబిడియమే, నోట్లో నాలిక లేకపోవటమే.

వాళ్లని చూస్తున్నప్పుడతను వాళ్ళ బీదస్థితిని గమనించగలిగాడు. ఇంత సుందర ప్రకృతి నడుమ ఈ నిరుపేదజీవాలు–ఒంటిని చక్కగా కప్పుకోవటానికి గుడ్డలేనంత నిరుపేదలంటే నమ్మలేకపోయినాడు. ఇదిచాలా ఆశ్చర్యంగావుందే! పంట అంతా పండించేది వాళ్లేగా! ఇది సమస్యే. మొదటి నుంచీ పట్టణవాసి అయిన రామానికిది సమస్యే. కాని నిజమంతే. ధనానికి వాళ్లు ఏజంట్లు మాత్రం. వాళ్ల చేతుల్లో మిగిలేది ఏమీలేదు.

ధనంలో పేదలేమో, కాని హృదయంలో మాత్రంకాదు. లేకపోతే ఆ అవ్వ తననెందుకుండనిస్తుంది. తను వచ్చిన మర్నాడు ఆమె వెళ్లమనీ అనలేదు. తను వెళ్తాననూలేదు. ఈ నాటి నుంచి వాళ్ళశ్రేయస్సుకై పాటుపడాలనిపించింది. ధృఢసంకల్పమే అది. కాని—తనకు శక్తివుందా. ప్రపంచమంతా చేతకాని వాడంటేనేగా తనిక్కడికి వచ్చేసింది. ఏమో, యీ విషయంలో తన సామర్థ్యం సందేహాస్పదముందే.

అవ్వతో ఆలోచించాడు.

'నాయనా, చేతకాకపోవటమేమిటి? తలుచుకోవాలేగాని, నీబోటివాళ్లకు చేతకానిదేముంది' అన్నది.

ఈ మాటనిజమేనా?

అవ్వ ఆశీర్వచనంతో ఆ వూళ్లో పిల్లలకు వుచిత పాఠశాల పెట్టాడు.

* * *

దాదాపు సంవత్సరంతిరిగింది. రామం యిప్పుడు వేరు మనిషి. రైతునాయకుడు–ఆ పరిసరాలకేనను కోండి. ఎత్తుకుంటే అలాగే ఎత్తుకుంటుంది దశ. హృదయపూర్వకంగా, తన సర్వస్వాన్ని అర్పించి చేసేసేవను ఆమోదించి, హర్షించారు ఆ ప్రజలంతా. ఇప్పుడు తన సమర్థతను గురించి నిశ్చయపరుచుకున్నాడు—తను తక్కినవాళ్ళకేమీ తీసిపోననే నమ్మకం కలిగింది. అవ్వ చెప్పిన ధైర్యంతో ముందుకు సాగిపోయేసరికి త్రోవంతా పుష్పసజ్జితమయింది. నేడు ప్రపంచమే, అతని దృక్పథంలో వేరు స్వరూపాన్నందింది. చిమ్మచీకట్లతో నిండిన సాంద్రారణ్యం కాస్తా, శారద చంద్రికలు చిందిన నందనవనంగా తోచింది.

స్వంతపనులే చేసుకోలేని రామం నేడు కొన్ని వేల ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వారిని గురించిన ఏ విషయమయినా అతనితో ప్రస్తావిస్తే చాలు, వాళ్లందరినీ కలుసుకుని ఆలోచించినట్లే.

ఆయేటి సర్వోదయసమాజ సమావేశం మదరాసు పట్టణంలో జరుగుతుంది. దానికి ఒక ప్రతినిధి రామం.

అఖండమయిన ఏర్పాట్లు జరుగుతున్నయి. తేదీ సమీపిస్తున్నకొద్దీ ప్రజల్లో వుత్సాహం ఎక్కువవుతున్నది. దేశంలో అగ్రనాయకులంతా ఆరోజు సమావేశమవుతారు.

ఆరోజు వచ్చింది. డెలిగేట్లంతా హడావుడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. అందరికీ పని వుండే తిరుగుతున్నారని మనమనుకోవాలి. ఒక్కసారి కాఫీహోటలు వంకచూస్తే అక్కడా యిలాగేవుంటుంది. తిండి తరువాతనే ఏదయినా. చిన్నచిన్న గుంపులుగాచేరిమాట్లాడుకుంటున్నారు. ఏం మాట్లాడుకుంటున్నారో అని దగ్గరికి పోయి వినరాదు. అందులో ఏమీ లేకపోతే నిరాశ చెందాల్సి వస్తుంది. నిజంగా పని వున్నవాళ్లు హడావుడి పడనేపడరు. ముందరే జాగ్రత్త పడతారు.

సభకు నిర్ణీతకాలం ఆసన్నమవుతున్నది. డెలిగేట్లు ఒక్కొక్కరూ చంకన యిన్ని కాగితాలు పెట్టుకుని బయలుదేరుతున్నారు.

ఒక్కసారిగానే బయటకు వచ్చారిద్దరూ. రామం ఒక కుటీరంలోనుంచి. అతని భార్య ప్రక్క కుటీరంలోనుంచి.

విస్తుపోయినాడు రామం. అంతకంటె ఆశ్చర్యమామెకు. కొంచెం తెప్పరిల్లి-

'మీరా' అన్నది. అంతకంటె ఏమీ వెకిలి రాలేదు. అసలు నోట మాటే లేదు రామానికి. ఏదైనా విపరీతమనోభావం ఏర్పడ్డప్పుడు మనసు, కంఠం రెండూ స్తంభించిపోతయి. పని చేయటం మానేస్తయి.

'మీరు దీనికి డెలిగేటుగా వచ్చారా'

'ఏం ఆశ్చర్యపడుతున్నావు. ఇంకా నేను చేతకానివాడి ననేనా నీ నమ్మకం' అన్నాడు నవ్వుతూ.

'ఆ, చేతనయిన వారైతే భార్య నదుపులో పెట్టలేక ఎందుకు పారిపోతారు?' అన్నది కొంటెగా నవ్వుతూ.

చెట్టాపట్టాలు పట్టుకుని సభకు నడిచి వెళ్ళారు.

# జాపాను యుద్ధనేరస్థులు

"బృహస్పతి"

ఇటీవల టోకియోలో పదకొండు దేశాల న్యాయమూర్తుల సమక్షాన టోజో మొదలుగాగల 25 గురు జాపానీ యుద్ధ నేరస్థులు విచారించబడి శిక్షలు విధించబడ్డారు. కొందరికి ఉరిశిక్షా, మరికొందరికి యావజ్జీవఖైదూ, ఇంకా కొందరికి కొన్ని సంవత్సరాలపాటు కారాగారవాసమూ విధించారు.

జర్మను యుద్ధనేరస్థులను న్యూరెంబర్గులో ఇట్లాగే విచారించి శిక్షించారు. ఆ శిక్షలను గురించి "అయ్యో, పాపం," అన్నవాళ్లు లేరు. అవి మనకు దూరాన ఉండిపోయాయి.

జపాను యుద్ధనేరస్థుల విచారణ గురించీ శిక్షలు గురించీ అనేక అభిప్రాయ భేదాలు వచ్చాయి.

న్యాయమూర్తులలో ఒకడయిన భారతీయ ప్రతినిధి, ముద్దాయీలందరూ నిర్దోషులే, వారిమీద ఎట్టి ఆరోపణలూ నాకు కనిపించడంలేదు, అన్నాడు.

శిక్షలు చాలా బరువుగా ఉన్నాయి, అన్నాడు మకార్థరు. అయితే ఈ శిక్ష